
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 28 నవంబరు 2025



కరగ్రహారంలోని ప్రభుత్వ భూముల్లో బుసక తవ్వకాలు



బుసకాసురులు!

బుసకాసురులు బరి తెగించారు. మచిలీపట్నం నార్త్ మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో యథేచ్ఛగా బుసక దందా సాగిస్తున్నారు. ముడా, ప్రభుత్వ భూములనే లక్ష్యంగా చేసుకుని కరగ్రహారం, గోపువానిపాలెం, మంగినపూడి, చినకరగ్రహారం గ్రామాల్లో ప్రధానంగా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. వీరికి ముడా సర్వేయర్ ఒకరు, ఆయా గ్రామాల వీఆర్వోలు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే, రెవెన్యూ అధికారులు వచ్చేసరికి అక్కడి నుంచి పరారవుతున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లోని ప్రజల వద్దకు వెళ్లి బుసక తవ్వకాలను అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. మాకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయని చెప్పుకుంటూ బుసక దందాను కొనసాగిస్తున్నారు.

సముద్ర తీర గ్రామాల్లో యథేచ్ఛగా బుసక దందా!

- ముడా, ప్రభుత్వ భూముల్లోనే ప్రధానంగా తవ్వకాలు
- కరగ్రహారం, గోపువానిపాలెం, మంగినపూడి, చినకరగ్రహారం గ్రామాల్లో ప్రధానంగా..
- అక్రమార్కులకు ముడా సర్వేయర్, వీఆర్వోల సహకారం!
- తహసీల్దార్‌కు ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదు
- రెవెన్యూ అధికారులు వెళ్లే సమయానికి అంతా గప్‌చుప్
- బుసక తవ్వకాలను అడ్డుకుంటే అంతు చూస్తామని స్థానికులకు అక్రమార్కుల బెదిరింపులు
- అధికార, ప్రతిపక్ష నేతల కనుసన్నల్లోనే వ్యవహారం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం నార్త్ మండలం కరగ్రహారం గ్రామంలోని 15, 16 సర్వే నెంబర్లలో, చినకరగ్రహారంలోని 28, 32, 33, 38, 42 సర్వే నెంబర్లలో, మంగినపూడి, గోపువానిపాలెంలో 153, 157 సర్వే నెంబర్లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వానికి రైతులు విక్రయించిన భూములతోపాటు బే ఆఫ్ బెంగాల్ భూములు ఉన్నాయి. ఈ భూముల నుంచి ఇటీవల కాలంలో బుసక అక్రమ తవ్వకాలు, రవాణా అధికమైంది. ఈ ప్రాంతంలోని భూములు ఇసుక నేలలు కావడంతో వర్షం కురిసినా బుసక రవాణాకు పెద్దగా ఇబ్బంది ఉండదు. ముడాలో పనిచేసే సర్వేయర్ ఒకరు ముడా భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే అంశంపై పగలు సమయంలో సరిహద్దులు బుసక అక్రమార్కులకు చూపుతున్నాడనే విమర్శలు ఉన్నాయి. దీంతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేసే వీఆర్వోలను ప్రసన్నం చేసుకున్న బుసక అక్రమార్కులు కొన్ని రోజులుగా జోరుగా ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వేసి విక్రయించేస్తున్నారు. రాత్రయితే చాలు ఎక్స్ కవేటర్‌లు, ట్రాక్టర్‌లు పెట్టి బుసకను తవ్వి విక్రయిస్తున్నారు. చినకరగ్రహారం గ్రామంలో 188 ఎకరాల ముడా భూములతో పాటు వందలాది ఎకరాల బే ఆఫ్ బెంగాల్ భూముల నుంచి వేలాది ట్రక్కుల బుసకను తవ్వేశారని ఇటీవల గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు తనిఖీ కోసం వెళ్తుంటే కొందరు వీఆర్వోలు ముందస్తుగా అక్రమార్కులకు సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కూటమి నాయకులు అధికారులకు ఫోన్ చేసి మా వాళ్లే మిగతా 4లో..

గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే బెదిరింపులు

ఇటీవల కాలంలో ప్రభుత్వ భూముల నుంచి బుసక రవాణా అధికంగా చేస్తుండటంతో చినకరగ్రహారానికి చెందిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల పాటు రెవెన్యూ అధికారులు రాత్రి వేళలో బుసక తవ్వే ప్రాంతానికి వెళ్లేలోగానే, అధికారులు వస్తున్నారనే సమాచారం ముందస్తుగానే తెలుసుకున్న అక్రమార్కులు వెంటనే ట్రాక్టర్‌లు, ఎక్స్‌కవేటర్‌లను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించేశారు. ఈ పరిణామాల అనంతరం అక్రమార్కులు చినకరగ్రహారం పంచాయతీ పరిధిలోని క్యాంప్‌బెల్ పేటకు చెందిన కొందరి గృహాల వద్దకు వెళ్లి బుసక తవ్వకాలపై మీరే అధికారులకు సమాచారం ఇచ్చారని, మీ అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగడం గమనార్హం. అధికార, ప్రతిపక్షాలకు చెందిన నాయకుల మద్దతు మాకుందని, ఏమైనా చేస్తామని తీవ్రస్థాయిలో భయపెట్టినట్టు సమాచారం. స్థానిక పెద్దలు చొరవ చేసుకుని గొడవ పెరగకుండా ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్



ఈవీఆర్ ఆస్పత్రిలో తనిఖీలు

- రికార్డులు పరిశీలించిన ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్
- ఆస్పత్రిలోని ఆపరేషన్ల రికార్డుల స్వాధీనం
- విచారణ జరిపి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని ఈవీఆర్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయకుండానే చేసినట్టు నకిలీ బిల్లులు పెట్టుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'గుండె సమస్య.. మోకీలుకు ఆపరేషన్' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా అధికారులు స్పందించారు. గురువారం స్థానిక ఈవీఆర్ ఆస్పత్రిలో రికార్డులను ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్ కుమార్ తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈవీఆర్ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్యం చేయించుకున్న వారిని విచారిస్తామని తెలిపారు. అనంతరం దీనిపై వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్‌కు నివేదికను సమర్పించనున్నట్లు వివరించారు. కాగా, ఎన్టీఆర్ వైద్యసేవలో చికిత్స పొందిన వారి ఫోన్ నంబర్‌లను కాకుండా ఆస్పత్రిలో పనిచేసే నమ్మకస్థులైన వారి నెంబర్‌లను అప్‌లోడ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. తక్కువ ధరకు లభించే మిగతా 4లో..

దిత్వాహ్ తుఫాను ముప్పు!

- 29,30న కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు
- రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

మచిలీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం దిత్వాహ్ తుఫానుగా మారడంతో నెల 29న కోస్తాతీరం వెంబడి భారీవర్షం కురుస్తుందని వాతావరణశాఖ గురువారం హెచ్చరించింది. ఈ నెల 30 తేదీన తుఫాను తీరం దాటుతుందని, ఆ సమయంలో దక్షిణ కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షం కురుస్తుందని రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. డిసెంబరు 1వ తేదీన కోస్తా తీరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మచిలీపట్నం ఓడరేవులో రెండో ప్రమాదహెచ్చరికను జారీచేశారు. తుఫాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, వరి సాగు చేసిన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ సూచించింది.

పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు



శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి

- ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవాలు

మోపిదేవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి షష్టి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, నిత్యహోమం, పంచామృత స్నపన వంటి కార్యక్రమాలు జరిపారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామోత్సవం జరిపారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, పర్యవేక్షకులు మధు సూదనరావు, చెన్నకేశవలు పాల్గొన్నారు.

గ్రీన్‌సిగ్నల్ ఇవ్వరా?

- విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కేంద్ర అనుమతుల్లో జాప్యం
- అన్నీ సిద్ధం చేసుకున్న ఏపీఎంఆర్‌సీ.. అయినా తప్పని నిరీక్షణ
- టెండర్లు పిలిచి టెక్నికల్ బిడ్లు తెరిచినా ఆలస్యం
- రుణ ప్రయత్నాలు కొలిక్కి.. ట్రాఫిక్ సర్వే కూడా పూర్తి
- కావాల్సినంత జనాభా ఉన్నా పట్టాలెక్కని ప్రాజెక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టే విజయవాడ మెట్రో ప్రాజెక్టు కోసం రుణ ప్రయత్నాలు కొలిక్కివచ్చాయి. మెట్రోను వేగంగా పరుగులు పెట్టించటానికి వీలుగా టెండర్ల ప్రక్రియ దగ్గర నుంచి నిధుల సమీకరణ వరకు అన్ని ప్రయత్నాలు చేశారు. ఇప్పటికిప్పుడు అనుమతులు ఇస్తే టెండర్ల ఖరారు మొదలు, రుణం లభించటం, పనులకు సిద్ధం కావడం.. వంటివి సమాంతరంగా జరిగేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. అయితే, కేంద్రం అనుమతుల విషయంలో జరుగుతున్న జాప్యం కారణంగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ)కు ఏం చేయాలో తెలియట్లేదు. గతంలో కూడా అన్నీ సిద్ధం చేసుకున్నాక రెండేళ్ల పాటు కేంద్రం అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేసింది. చివరికి నూతన మెట్రో పాలసీని ప్రవేశపెట్టి అనుమతులు ఇవ్వలేదు. నూతన మిగతా 4లో..

ఓఆర్ఆర్‌కు మరో ఏడాది

- అమరావతి అవుటర్ రింగురోడ్డుకు మరింత సమయం
- జిల్లాల స్థాయిలో గజిట్ నోటిఫికేషన్ల తర్వాతే కొలిక్కి..
- అభ్యంతరాల స్వీకరణ.. తర్వాత తుది నోటిఫికేషన్
- భూ సేకరణ పూర్తయ్యాకే సరిహద్దు రాళ్లు
- పర్యావరణ, అటవీశాఖ అనుమతులు అవసరం
- ఆర్థిక ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తప్పనిసరి
- ఈ ప్రక్రియ అంతటికీ ఏడాదిపైనే సమయం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) సాకారానికి మరో ఏడాది సమయం తప్పేలా కనిపించట్లేదు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 3ఏ ప్రతిపాదనల్లో పురోగతి నెలకొన్నా.. వివిధ దశలు పూర్తికావడానికి ఏడాది సమయం పట్టే అవకాశం ఉందని ఎన్‌హెచ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పటికి కానీ ఫైనల్ గజిట్ నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్)కు రూపొందించిన ఆర్థిక ప్రతిపాదనలు.. తుది అనుమతుల కోసం ప్రస్తుతం పీపీపీ అప్రైజల్ కమిటీ దృష్టికి మిగతా 4లో..

గ్రేటర్‌కు గన్నవరం

- గ్రేటర్ విజయవాడలో విలీనానికి గన్నవరం గ్రామాల ఏకగ్రీవ తీర్మానాలు

6

ఇసుక కొరత లేకుండా చూడండి

- కలెక్టర్ బాలాజీ



దుర్గగుడి ఏఈఓ (చేతిలో హెల్మెట్ ఉన్న వ్యక్తి) రమేష్ బాబుతో గొడవపడుతున్న దుకాణదారుడు సోమయ్య, మరో వ్యక్తి

బకాయిలు చెల్లించమన్నందుకు.. దుర్గగుడి అధికారిపై వ్యాపారి దౌర్జన్యం!

» రూ.లక్షల్లో పేరుకుపోయిన షాపుల అద్దె బకాయిలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం దుకాణదారులు సకాలంలో అద్దె చెల్లించకపోవటంతో లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. దీంతో బకాయిలు చెల్లించాలని దుకాణదారుడిని కోరగా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని సంబంధిత విభాగం అధికారి చెబుతున్నారు. కనకదుర్గానగర్‌లో మొత్తం 11 షాపులు ఉండగా.. కొందరు మాత్రమే సకాలంలో అద్దె చెల్లిస్తున్నారు. కొందరు చెల్లించకపోవటంతో బకాయిలు బాగా పెరిగిపోయాయి. సుమారు రూ.30లక్షలకు పైగా అద్దెలు దేవస్థానానికి చెల్లించాల్సి ఉంది. అద్దె బకాయిలపై సంబంధిత విభాగ సిబ్బంది అడుగున్నప్పటికీ దుకాణదారులు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. సంబంధిత విభాగ ఏఈఓ ఎన్.రమేష్ బాబు ఇటీవల మహామండపం దిగువన ఉన్న దుకాణదారుడు కె.సోమయ్య వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించాలని అడగ్గా.. దౌర్జన్యానికి దిగాడని తెలిపాడు. సకాలంలో అద్దెలు చెల్లించకపోతే ఈవోకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.



27సీపీ02 : ఎడ్లంక కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభించిన నేతలు

తీరనున్న ఎడ్లంక వాసుల కష్టాలు

» టీడీపీ నేతల చొరవతో నిర్మాణ పనులు ప్రారంభం

అవనిగడ్డ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఎడ్లంకవాసుల కష్టాలు తీరనున్నాయి. వరదల్లో కొట్టుకుపోయిన కాజ్‌వే నిర్మాణానికి స్థానిక టీడీపీ నేత బొబ్బా గోవర్దన్ ముందుకురావడంతో గ్రామానికి దారిలేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎడ్లంక వాసుల ఇబ్బందులు తొలగనున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే మహిళలు నదిలో దిగి వెళ్లాల్సిన అవసరం ఉండదు. గ్రామస్థుల బొబ్బా గోవర్దన్‌కు తమ సమస్యను వివరించగా ఆయన స్పందించారు. గురువారం కాజ్‌వే పునరుద్ధరణ పనులను స్థానిక నేతలు ప్రారంభించారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పర్చూరి దుర్గాప్రసాద్, అడపా శ్రీను, కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం, నవరత్నాల ఫోటోతో రైతు భరోసా కేంద్రం

ప్రభుత్వం మారినా.. మారని సేవా కేంద్రాలు!

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి రెండేళ్లవుతున్నా కార్యాలయ భవనాలపై మాజీ ముఖ్యమంత్రి ఫోటోలతో పాటు పేర్లు మార్చటంలో అధికారులు అలక్ష్యం వహిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ఏర్పాటు చేసిన భవనాలను ప్రస్తుత ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. బూదవాడలో భవనంపై మాజీ సీఎం, నవరత్నాల ఫోటోలను అధికారులు ఇంకా మార్చకపోవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీని వివరణ కోరగా.. పంచాయతీరాజ్ శాఖ భవనాన్ని తమకు అప్పగించలేదని ఏదైనా అవసరమైతే పశు వైద్య కేంద్రంలోని భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, తాజాగా ప్రభుత్వం రేషనలైజ్ చేయటంతో బూదవాడ, కెఅగ్రహారం, ముక్త్యాలను యూనిట్‌గా చేయటంతో కె.అగ్రహారంలోని కేంద్రాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు.

అమరావతిలో ప్రతి సమస్యకు పరిష్కారం

» రైతులకు అండగా సీఎం, కూటమి ప్రభుత్వం

» అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ వెల్లడి

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'అమరావతిలో ఉన్న ప్రతిసమస్యను తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని సీఎం చంద్రబాబు చెప్పారు.. రాజధానికి భూములు త్యాగం చేసిన ప్రతి రైతు సమస్యా పరిష్కరిస్తామన్నారు..' అని అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎంతో భేటీ అనంతరం రాజధాని రైతులు పలువురు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ.. అమరావతి రాజధానిపై తీసుకునే ప్రతినిర్ణయం పారదర్శకంగా ఉంటుందని సీఎం చెప్పారన్నారు. సుమారు గంటన్నరపాటు సమావేశమై మాలో ఉన్న అపోహలు, భయాందోళనలు, సమాచారలోపంతో అవగాహనారాహిత్యాన్ని సీఎం తొలగించే ప్రయత్నంచేశారన్నారు. ప్రతి విషయాన్ని సీఎం కూలంకషంగా వివరించారన్నారు. అధికారుల ద్వారా ఎవరికైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే సరి చేస్తామన్నారు. కావాలని అమరావతి రాజధాని మహాయజ్ఞానికి ఎవరైనా భంగం కల్పిస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పారన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లతో కూడిన కమిటీ ప్రతినెలా రాజధాని రైతుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తుందన్నారు. రాజధాని నిర్మాణం కోసం 30 ఏళ్ల విజన్ పెట్టుకుని పనిచేస్తున్నామని సీఎం తెలిపారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి అమరావతి రైతులు, రైతుప్రతినిధులతో మాట్లాడతామని సీఎం చెప్పారన్నారు. త్రిసభ్య కమిటీ ప్రతి నెలా సమావేశం అవుతుందన్నారు. గ్రామ కంఠాల పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి సర్వేచేసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. రైతుల మధ్య అంతరాలు లేకుండా చూసుకోవాలని, నెలరోజుల్లో కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం గ్రామ కంఠాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. సంస్థలన్నీ ఒకే వైపునకు వెళ్లిపోతున్నాయని, రాజధానిని ఏవిధంగా అభివృద్ధి చేస్తారని అడగ్గా.. అదిమీ అపోహ మాత్రమేనని, రాజధానితోపాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని చెప్పారన్నారు. అంతర్జాతీయస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని చెప్పారన్నారు.

వాహనాలు కొరతతో రహదారిపైనే ధాన్యం బస్తాలు



కొనేవారేరి!

దిత్వాహ్ తుఫాను హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. మొంథా తుఫాను కారణంగా పంట దిగుబడిలేక నష్టపోయిన రైతులు ఉన్న పంటనైనా కాపాడుకునేందుకు యంత్రాలతో కోతలు ప్రారంభించారు. కొన్నిచోట్ల పంట కోతలకు సిద్ధంగా ఉండగా, కొన్నిచోట్ల ధాన్యం పచ్చిగా ఉన్నప్పటికీ కోతలు పూర్తిచేసి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు.

» పంట పొలాల్లో ముమ్మరంగా వరి కోతలు!

» తుఫాను హెచ్చరికలతో యంత్రాలబాట

» గ్రామాల్లో కోత యంత్రాల హడావిడి..

» రహదారులపైనే ధాన్యం రాశులు

» ఎప్పుడు ఏం ముంచుకొస్తుందోనని రైతుల్లో భయాందోళన

(చల్లపల్లి/మోపిదేవి-ఆంధ్రజ్యోతి)

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోత ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు యంత్రాల బాటపట్టారు. గ్రామాల్లో ఎటుచూసినా వరికోత యంత్రాలే దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ కూలీల డిమాండ్, ఖర్చులు విపరీతంగా పెరిగిపోవటంతో వరిగడ్డి నష్టపోయినా కోత యంత్రాలవైపు రైతులు ఆసక్తిచూపుతున్నారు. ఖరీఫ్‌లో వరికోతల సీజన్ తొలినుంచీ యంత్రాలతో కోతలు గ్రామాల్లో అధికమయ్యాయి. వరిగడ్డి కావాల్సిన రైతులు, పంట కోతలకు పూర్తిస్థాయిలో తయారుగా ఉన్న చేలల్లో మాత్రం అక్కడక్కడా కూలీలతో కోతలు కోసి కుప్పలు వేయిస్తున్నారు.

కోత యంత్రాలకు డిమాండ్



వరికోత యంత్రానికి గంటకు రూ.3500 తీసుకుంటున్నారు. ఎకరం పొలాన్ని గంటన్నర నుంచి రెండు గంటల వ్యవధిలో యంత్రం కోతలు పూర్తిచేస్తుంది. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తీసుకువచ్చి రహదారులపై ఆరబెట్టుకుంటున్నారు. ధాన్యంలో తేమశాతం, పచ్చదనాన్ని బట్టి రెండు, మూడురోజులు ఆరబెట్టుకోవాల్సి ఉంటుంది. కూలీలతో కోతలు రైతులకు భారంగా మారటంతో ఎక్కువమంది యంత్రాలవైపే మొగ్గుచూపుతున్నారు. గ్రామాల్లో వరికోత యంత్రాలను మధ్యవర్తుల ద్వారా రప్పించి కోతలు పూర్తిచేస్తున్నారు. ఎకరం వరికోతలకు రూ.5వేలు, నేలవాలిన వరికోతలకు రూ.6500 తీసుకుంటున్నారు. పనలు తిరగేసేందుకు మరో వెయ్యి, కట్టేతకు..కుప్పలు వేసేందుకు రూ.4వేలు చొప్పున ఎకరానికి రూ.10వేలకు పైగా ఖర్చుచేయాల్సివస్తోంది.

కుప్ప నూర్పిడి మళ్లీ అదనపు ఖర్చు

చల్లపల్లి మండలంలో 13,200 ఎకరాల్లో వరిసాగు జరగ్గా, ప్రధానంగా 1061, 1318, 1224, 1262 రకాలను రైతులు సాగుచేశారు. మాజేరు, మంగళాపురం, లక్ష్మీపురం, పుచ్చగడ్డ తదితర గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు యంత్రాల ద్వారా జరుగుతున్నాయి. చల్లపల్లి మండలంలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా, అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైంది. 26వ తేదీ నాటికి 2156 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. వాతావరణంలో మార్పులు రావటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జాతీయ రహదారులు, గ్రామాల్లో ఎటుచూసినా ఆరబెట్టిన ధాన్యమే కనిపిస్తోంది. మొంథా తుఫాను ప్రభావానికి దిగుబడి తగ్గిన పంట అయినా చేతికి రావాలంటే సెన్యార్ తుఫాన్ గండం నుంచి గట్టెక్కాలని రైతులు ఆశగా చూస్తున్నారు.

కొనుగోళ్లు లేక రైతుల అవస్థలు

మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లిలో ఖరీఫ్ కొనుగోళ్లు అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఆరువేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, నాలుగువేల ఎకరాల్లో బీపీటీ సాగుచేశారు. ప్రస్తుతం రెండువేల ఎకరాల వరకు యంత్రాల ద్వారా నూర్పిడి చేశారు. మొంథా తుపాను కారణంగా ధాన్యంలో నాణ్యత లోపించిందని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో కొనుగోలు కేంద్రానికి వందల సంఖ్యలో రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని తీసుకెళ్లగా, మిల్లర్లు బీపీటీ ధాన్యం కొనుగోలు చేయటం లేదని రైతులు చెబుతున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పినా మిల్లర్లు, అధికారుల తీరు మారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వెంకటాపురం-పెదకళ్లేపల్లి, మంగళాపురం, మాజేరు కుమ్మరిపాలెం ప్రధాన రహదారుల వెంబడి గుట్టలుగా బస్తాలు, ధాన్యం రాశులు పోసి కాపలాకాయాల్సి వస్తున్నదని చెబుతున్నారు. పదిరోజులుగా ధాన్యాన్ని బస్తాల్లో వేసినా వాహన సౌకర్యం లేక రహదారుల వెంబడి కాపలా కాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గిట్టుబాటు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వారం రోజులుగా ధాన్యం ఆరబెడుతున్న రైతులు



పుచ్చగడ్డలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యపురాశులు

ఎనిమిది రోజులుగా కాపలా కాస్తున్నా



- గండు నాగరాజు, కౌలు రైతు

కుటుంబ జీవనాధారం కోసం కౌలుకు బీపీటీ సాగు చేశా. ఎనిమిది రోజుల క్రితం యంత్రం ద్వారా నూర్పిడి చేసి గ్రామంలోని దేవాలయం వద్ద ఖాళీ ప్రదేశంలో ఆరబెడుతున్నా. నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రానికి నమూనా తీసుకెళ్లి చూపించగా, ఇంకా ఆరబెట్టాలని చెబుతున్నారు. ఎన్ని రోజులు కాపలా కాయాలి, మా పరిస్థితి ఏమిటి?

ఎవరూ పట్టించుకోవటం లేదు



- పంద్రాజు దుర్గా ప్రసాద్

మొంథా తుఫాను కారణంగా పంట నేలవాలి ధాన్యం కొంతమేర నాణ్యత లోపించింది. వారం రోజులుగా ఆరబెడుతున్నాము. కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా, బీపీటీ ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయటం లేదని సమాధానం చెబుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యాన్ని ఏం చేసుకోవాలి. రైతుల కష్టాలు పట్టించుకునే వారు లేరా?



భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఈవో శీనానాయక్

భవానీల దీక్ష విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు

» ఆరు లక్షల మంది భవానీ భక్తులు వస్తారని అంచనా

» దసరా ఉత్సవాల స్ఫూర్తితో ముందస్తు ప్రణాళిక : ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిలో భవానీ దీక్షల విరమణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై డిసెంబరు 11 నుంచి 15 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను గురువారం కలెక్టర్, పోలీస్ కమిషనర్, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, ఆలయ ఈవో వి.కె.శీనానాయక్‌లు సమన్వయ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది ఆరు లక్షలమందికి పైగా భవానీలు తరలివస్తారని అంచనా వేయడం జరిగిందన్నారు. ఐదురోజుల పాటు భవానీ దీక్షా విరమణలు నిర్వహించడం జరుగుతుందని, మొదటి మూడురోజులు రోజుకు లక్ష వరకు భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, చివరి రెండురోజులు లక్షా 50 వేల మంది భవానీ భక్తులు వస్తారని అంచనా ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

36 సెక్టార్లకు పర్యవేక్షణ బాధ్యతలు

భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా 36 సెక్టార్లను ఏర్పాటు చేసి ఒక్కో సెక్టార్‌కు ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతను అప్పగించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అధికారులు వారికి కేటాయించిన సెక్టార్‌లో భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి విచ్చేసే భవానీ భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా సమాచార కేంద్రాలు నిరంతరం అనౌన్స్‌మెంట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది 10 వేలమందికి పైగా భక్తులు కలశ జ్యోతులను సమర్పిస్తారని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

మూడువేల మంది పోలీసులతో బందోబస్తు

భవానీ దీక్షల విరమణ కార్యక్రమానికి మూడువేల మంది పోలీసులకు విధులు కేటాయించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. నగర కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వశాఖల అధికారులు, సెక్టార్ అధికారులను సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో 300లకు పైగా సీసీటీవీలను ఏర్పాటుచేస్తున్నామని, ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తూ సమస్య తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ అధికారులు గురుభవానీలతో మాట్లాడి ఈ ఏడాది ఏఏ ప్రాంతాల నుంచి ఎంతమంది భవానీ భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చేది ముందుగానే అంచనా వేసి తగిన విధంగా దర్శన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాడం జరిగిందన్నారు.

దసరా ఉత్సవాల తరహాలోనే..

దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. భవానీ భక్తులు ఇరుముడులు సమర్పించేందుకు మూడుప్రదేశాల్లో హోమగుండాలు ఏర్పాటు చేస్తున్నామని, కలశ జ్యోతులను సమర్పించే భక్తులు, భవానీ భక్తులకు చిన్న లడ్డు, పులిహోర ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గిరి ప్రదర్శన, అమ్మవారి ఊరేగింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామన్నారు. సామాన్లు క్లోక్ రూంల సంఖ్య పెంచడం జరిగిందని, 14 కౌంటర్ల ద్వారా లడ్డూల విక్రయానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భవానీ భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది 20 లక్షల లడ్డూలు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 850మంది నాయి బ్రాహ్మణులతో 24గంటలు కేశఖండన కేంద్రం నిర్వహిస్తామన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయనున్నట్టు ఈవో తెలిపారు.

గ్రీన్‌సిగ్నల్ ఇవ్వరా?

(3వ పేజీ తరువాయి)

మెట్రో పాలసీ వచ్చాక మళ్లీ ఇప్పటికి విజయవాడ మెట్రో పట్టాలెక్కనుండగా, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావటంలో జాప్యం జరగడం ఇబ్బందిగా మారింది.

జనాభా సమస్య లేదు

విజయవాడకు మెట్రో ప్రాజెక్టును ఇస్తామని కేంద్రం విభజన హామీచట్టంలో పేర్కొంది. ఇంత జనాభా ఉండాలి.. అంత జనాభా ఉండాలి.. అని ఎక్కడా నిర్దేశించకుండా ఇచ్చిన హామీని అమలు చేయటంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం జనాభాతో కూడా సమస్య లేదు. ఐదేళ్ల జాప్యంలో విజయవాడ అర్బన్ జనాభా బాగాపెరిగింది. మెట్రోలో భాగంగా నిర్మించే కారిడార్-1 గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్‌ల వరకు ఉంది. కారిడార్-2 పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు ఉంది. ఈ రెండు మెట్రో కారిడార్లు గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న గ్రామాల నుంచి మొదలవుతున్నాయి. ఈ ప్రాంతాల్లోనూ జనాభా పెరగడంతో ఇప్పుడు సమస్యే లేకుండా పోయింది. విజయవాడ ట్రాఫిక్‌పై కొద్దికాలం కిందట కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహించింది. మెట్రో ప్రాజెక్టు అవసరానికి తగినట్టుగానే ఈ సర్వే సాగింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో తెలియని పరిస్థితి.

ఎంపీలు స్పందించాలి

విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరిలు కేంద్రస్థాయిలో ఒత్తిడి తీసుకురాకపోతే ఈ ప్రాజెక్టు కూడా లూప్‌లైన్‌లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే విజయవాడ మెట్రో ప్రాజెక్టు కారిడార్-1లో అంతర్భాగమైన డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి మోర్త్ ఆసక్తిగా లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా మెట్రో జాప్యంపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఓఆర్ఆర్‌కు మరో ఏడాది

(3వ పేజీ తరువాయి)

వెళ్లాయి. ఇక్కడ ఓఆర్ఆర్ ప్రాజెక్టుపై అధ్యయనం జరుగుతోంది. అనుమతులు ఇచ్చాక.. కేంద్ర క్యాబినెట్ దశకు చేరుకుంటుంది. అక్కడి నుంచి అనుమతులు రావడం లాంఛనమే. ఈలోగా సమాంతరంగా కొన్ని ప్రక్రియలు ముగించాల్సి ఉంది.



3ఏ ప్రతిపాదనలు కొలిక్కి.

ఓఆర్ఆర్‌కు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3ఏ ప్రతిపాదనలు దాదాపు కొలిక్కి వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లా పంపిన 3ఏ ప్రతిపాదనలు తప్పులుగా ఉండటం వల్ల వాటిని ఎన్‌హెచ్ అధికారులు వెనక్కి పంపారు. వాటిని సరిచేసిన రెవెన్యూ యంత్రాంగం తిరిగి ఎన్‌హెచ్‌కు పంపింది. కృష్ణాజిల్లా నుంచి కూడా దాదాపు 3ఏ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించాక ఎన్‌హెచ్ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. రెండు జిల్లాల యంత్రాంగాలు స్థానికంగా గజిట్ నోటిఫికేషన్లను వెలువరిస్తాయి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో గజిట్ నోటిఫికేషన్‌ను అప్‌లోడ్ చేస్తాయి. ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కోసం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినప్పటి నుంచి 21 రోజుల్లో ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఆ తర్వాత జాయింట్ కలెక్టర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలుస్తారు. వారి నుంచి సమాచారం సేకరించటం పూర్తయ్యాక.. రెవెన్యూ, ఎన్‌హెచ్ వర్గాలు జాయింట్ సర్వే నిర్వహిస్తాయి. అభ్యంతరాల ప్రకారం క్షేత్రస్థాయిలో ఉన్న అంశాలను గుర్తిస్తారు. ఇలా అభ్యంతరాలన్నింటినీ పూర్తిచేశాక.. గజిట్‌లో పేర్కొన్న నిర్దేశిత భూములకు సరిహద్దు రాళ్లు పాతుతారు.

తుది గజిట్ నోటిఫికేషన్ ఎప్పుడు?

అవుటర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 140 మీటర్ల వెడల్పున మొత్తం 5 వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఓఆర్ఆర్ కోసం 5 వేల ఎకరాల్లో 140 మీటర్ల వెడల్పునకు తగినట్టుగా సరిహద్దు రాళ్లను వేస్తారు. ఇలా మొత్తం అలైన్‌మెంట్ పరిధిలో సరిహద్దు రాళ్లను వేశాక తుది గజిట్ నోటిఫికేషన్‌ను మొత్తంగా ఐదు జిల్లాల పరిధిలో ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావటానికి ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. అప్పటికి కానీ ప్రతిపాదిత భూములు ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేసే అవకాశం ఉంటుంది. ఒకవేళ కోర్టు కేసులు ఎదురైతే కొంత కాలయాపనకు కూడా జరగొచ్చు.

అనుమతులు అనేకం

తుది గజిట్ నోటిఫికేషన్ ఇచ్చాక టెండర్ల ప్రక్రియకు వెళ్లడానికి మరికొంత సమయం పడుతుంది. అమరావతి ఓఆర్ఆర్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు కాబట్టి పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. పర్యావరణ అనుమతులకు సంబంధించి కూడా ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పడుతుంది. దీంతో పాటు కొండపల్లి రిజర్వు ఫారెస్టు భూములు ఓఆర్ఆర్ పరిధిలోకి వస్తున్నాయి. అటవీ శాఖ క్లియరెన్స్‌లు కూడా తీసుకోవాలి. ఎంత అటవీ విస్తీర్ణం పోతుందో అంతమేర ప్రత్యామ్నాయంగా అడవిని అభివృద్ధి చేయాలి. అనంతరం హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి జరగాలి. ఇవన్నీ పూర్తయ్యాక మాత్రమే టెండర్ల దశకు వెళ్తుంది. కాబట్టి కనిష్టంగా ఏడాది సమయం, గరిష్టంగా రెండేళ్లకు పైగానే ఓఆర్ఆర్ శ్రీకారానికి సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

బుసకాసురులు!

(3వ పేజీ తరువాయి)

వదిలేయండని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

మంగినపూడి, గోపువానిపాలెంలో ప్రతిపక్ష నాయకుల కనుసన్నల్లో..

మంగినపూడి, గోపువానిపాలెం గ్రామాల్లో ఇటీవల కాలం వరకు అధికార పక్షానికి చెందిన ఓ ద్వితీయశ్రేణి నాయకుడి కనుసన్నల్లో బుసక రవాణా జరిగేది. ఇతని ఆగడాలు అధికం కావడం, పార్టీకి చెడ్డపేరు వస్తుండటంతో కళ్లు తెరిచిన అధికారపార్టీ పెద్దలు అడ్డుకట్ట వేశారు. దీంతో ప్రతిపక్షానికి చెందిన వారు ఇదే అదనుగా ఈ రెండు గ్రామాల నుంచి బుసక తవ్వకాలను, విక్రయాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరిని తమతో వాటాదారులుగా కలుపుకుని యథేచ్ఛగా బుసక తవ్వకాలను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ విభాగాల అధికారులు స్పందించి తీర గ్రామాల్లో బుసక రవాణాకు అడ్డుకట్టవేయాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈవీఆర్ ఆస్పత్రిలో తనిఖీలు

(3వ పేజీ తరువాయి)

జనరిక్ మందులను బ్రాండెడ్ మందులుగా రోగులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

మాజీ మంత్రి జోగి బావమరిది పాత్ర!

ఈవీఆర్ ఆస్పత్రిలో మాజీ మంత్రి జోగి రమేష్‌కు బావమరిది అయ్యే వైద్యుడు పనిచేస్తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా నకిలీ బిల్లుల వ్యవహారం నడిచిందని, అప్పట్లో మాజీ మంత్రి జోగి బావమరిదిని ఆస్పత్రిలో వాటాదారునిగా చూపి జోగి సహకారంతో నకిలీ బిల్లులను సొమ్ము చేసుకున్నట్లు పట్టణంలోని ఆస్పత్రి వర్గాల్లో చర్చ నడుస్తోంది.

రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

అవినీతి వ్యవహారాలు వెలుగుచూడటంతో ఆస్పత్రిని కాపాడుకునేందుకు యాజమాన్యం అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నట్టు తెలిసింది. వారిని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో తాము పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశామని గుర్తు చేస్తున్నట్టు తెలిసింది. ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేసేందుకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాల ఖర్చు కోసమే ఇటీవల తనకున్న పొలం అమ్మినట్లు ఒక ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించడం కొసమెరుపు.

నిజాలు నిగ్గుతేల్చేనా?

బాధితులకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకుంటామని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్ అనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా ఫోన్‌లో వివరాలను సేకరిస్తే నిజనిజాలు బయటకు వస్తాయా అనే సందేహం వ్యక్తమవుతోంది. గత వైసీపీ హయాంలో ఆస్పత్రిలో జరిగిన ఆపరేషన్లపై కూడా పూర్తిస్థాయి విచారణ జరపాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

కాకులపాడులో ప్రజాదర్బార్ నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జోగేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. కాకులపాడులోని పీఏసీఎస్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రజాదర్బార్ జరుపుతారన్నారు. బాపులపాడు మండలంలోని ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు నేరుగా తెలియజేసి పరిష్కారం పొందవచ్చన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రికార్డుల పరిశీలన

ఉయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ గురువారం పరిశీలించారు. రికార్డుల నెలవారీ నివేదికలు, సర్వేల పురోగతి, డిస్పాచ్ రికార్డులు, ట్రెజరీ బిల్లు, టూర్ ప్రోగ్రామ్ రిజిష్టర్ పరిశీలించారు.

చికిత్స పొందుతూ వీఏవో సాయికిరణ్ మృతి

ఉయ్యూరు. నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గండిగుంట వద్ద ఈనెల 21న ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండిగుంట గ్రామ వ్యవసాయ సహాయకుడు ఉప్పటాల సాయికిరణ్(24) గు రువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజుపేటకు చెందిన సాయికిరణ్ ఇబ్రహీంపట్నం మండలం ముళ్లపాడు గ్రామ వ్యవసాయ సహాకుడిగా పనిచేసి ఇటీవల గండిగుంట బదిలీపై వచ్చాడు. సాయికిరణ్ తండ్రి తన చిన్నతనంలోనే మృతి చెందగా తల్లికష్టపడి చదివించింది. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తనను చూసుకుంటున్న కుమారుడు దూరం కావడంతో తల్లి భోరున విలపించిది. సాయికిరణ్ మృతిపట్ల సహోద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

• ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, వ్యవసాయ ఖర్చులు పెరిగి వ్యవసాయం లాభసాటి కాని నేటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం తాడిగడపలో పర్యటించి కూరగాయలు, అరటితోటలను పరిశీలించారు. పంట పండించేందుకు అయిన ఖర్చు, మార్కెట్‌లో ధరలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాఅధికారి శైలజ, ఉద్యానవన అధికారి హర్‌చంద్, ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారులు పాల్గొన్నారు.



తాడిగడపలో అరటి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరులో ..

పెనమలూరు పల్లిపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు కో యా ఆనంద్ పాల్గొని మత్స్యశాఖ అందిస్తున్న పథకాలు మత్స్య కారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించి ఫలితాలను అనుసరించి పంటలకు ఎరువులు వాడుకోవాలని లాంఫామ్ శాస్త్రవేత్త బి.ఆశాజ్యో తి రైతులకు సూచించారు. సేంద్రియ, జీవన ఎరువులు ఉపయోగించి భూసారం పెంపొందించుకోవాలన్నారు. ధాన్యం ఆరబెట్టి 17 శాతం తేమ ఉండేలా చూసుకుని మద్దతు ధర లభించేలా చూసుకోవాలన్నారు. మత్స్యశాఖ నుంచి లైసెన్స్ తీసుకుంటే మత్స్య కారులు నదిలో వేట సమయంలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా పొందవచ్చని మత్స్య శాఖ సహాయకురాలు బి. లక్ష్మీదుర్గా సూచించారు. బలరామ్, ,సుభాని, ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో ఖాళీల భర్తీలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీవో సిహెచ్ నాగపద్మావతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. అల్లాపురం-2 (ఓసీ) అంగన్వాడీ కార్యకర్త పోస్టును భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అంగన్వాడీ సహాయకుల పోస్టులు బీబీగూడెం-1 (బీసీ-ఏ), కొత్తపేట(బీసీ-డి), అల్లాపురం-1(ఎస్సీ-మాల), అల్లాపురం-2 (ఓసీ), బుద్దవరం-3 (బీసీ-డి), దుర్గాపురం(ఓసీ), బూతిమిల్లిపాడు(ఎస్సీ-మాల), పొట్టిపాడు-2(బీసీ-డి), కాకులపాడు-1 (ఓసీ), కాకులపాడు-2 (ఎస్సీ-మాల), మల్లవల్లి-2 (బీసీ-ఏ), కొత్తపల్లి-2 (బీసీ-ఇ), కేసరపల్లి-3(ఎస్సీ-మాల), గారపాడు-1(ఎస్సీ-మాదిగ), ఆత్కూరు-5(ఓసీ జనరల్), పెద్దఅవుటపల్లి-2(ఓసీ జనరల్), పొణుకుమాడు (ఓసీ), దావాజిగూడెం-1(ఎస్సీ-మాదిగ), ఆరుగొలను-3(ఓసీ జనరల్), చిరివాడ-2(బీసీ-డి) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణులైన, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వివాహిత మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తుకు కుల, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ జతచేసి డిసెంబర్ 6వ తేదీలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులపై జాగ్రత్త వహించాలి

ఉంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులు, వైకల్యం పట్ల అవగాహనతో కూడిన అప్రమత్తత అవసరమని, బాలల అభివృద్ధికి నిరోధకంగా ఉండే వ్యాధులకు సరైన చికిత్స అందించిఆరోగ్యరక్షణ కల్పించాలని జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆరోగ్య సమన్వయకర్త, ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం పొట్టిపాడు, ఆత్కూరు ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పి.శ్రీనివాసరావు, ఎస్.ప్రకాష్ రాణి, సీహెచ్‌వో ఎస్.రామారావు, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి విగ్రహ పున:ప్రతిష్ఠ

• విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసరపల్లిలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో విగ్రహ పునఃప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయంలో దాసాంజనేయ స్వామి, విఘ్నేశ్వరుని విగ్రహాల పునఃప్రతిష్ఠ చేశారు. గత మూడు రోజులుగా జరుగుతున్న హోమం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి సమర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి దైవానుగ్రహం తోడు కావాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని దైవాన్ని కోరుకున్నట్లు చెప్పారు. యార్లగడ్డ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. శివ కళ్యాణం జరిపి అన్న సమారాధన నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, డీసీ వైస్ చైర్మన్ జాన్సీ విజయభాషణ్ కుమార్(బుజ్జి), ఎంవిఎల్ ప్రసాద్, అన్నే హరికృష్ణ, మూల్పూరి మాధవన్, కోసూరు వెంకటేష్, అన్నే అంజిబాబు, ఎస్.రామకృష్ణ, శేషు, తదితర కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



కలశాలను తీసుకెళుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అమరావతిని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేస్తాం

• ఏపీసీఆర్‌డీఏ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ గోపాలకృష్ణారెడ్డి

కానూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): అమరావతి నగరాన్ని గ్లోబల్ సిటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీసీఆర్‌డీఏ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో స్మార్ట్ సస్టైనబుల్ సిటీస్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే మూడో అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమయింది. ముఖ్యఅ తిథిగా హాజరైన గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిలో సవాళ్లు, అవకాశాలను వివరించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీఎల్) చీఫ్ ఇంజనీర్ సీహెచ్ ధనుంజయ మాట్లాడుతూ అమరావతికి తన కృషి, నిర్మాణ సాంకేతికతను వివరించారు. అమరావతిలో ప్రాక్టికల్ లెర్నింగ్ కోసం సిద్ధార్థ వర్సిటీకి ఆయన ఆహ్వానం పలికారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కూడా కల్పిస్తామన్నారు. సిద్ధార్థ వర్సిటీ వైస్ చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేడు శాశ్వత నగరాల నిర్మాణంలో విద్యా సంస్థల పాత్రను వివరించారు. సిద్ధార్థ అకాడమి జాయింట్ సెక్రటరీ ఎస్.విష్ణు ప్రసంగిస్తూ స్మార్ట్ సిటీల అభివృద్ధిలో సాంకేతికత పాత్రను తెలియజేశారు. సివిల్ ఇంజ నీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.మల్లికార్జున స్వాగతం పలకగా కార్యక్రమంల వీసీ ఎ.వి.రత్నప్రసాద్, ప్రొఫెసర్‌లు పాండు రంగారావు, వై. నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



అంతర్జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



దాత అన్నే పద్మనాభరావును సత్కరిస్తున్న సర్పంచ్ లాం సోనియా

పాఠశాల స్థలదాత అన్నే పద్మనాభరావుకు ఘన సత్కారం

కంకిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉప్పలూరు జిల్లా పరిషత్ పాఠశాలకు అర ఎకరం స్థలాన్ని అందించిన అన్నే పద్మనాభరావును గ్రామ ప్రజలు అన్ని వేళలగా గుర్తుంచుకుంటారని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియ అన్నారు. ఉప్పలూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో స్థల దాతను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ లాం సోనియా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతల సహకారంఅభినందనీయమన్నారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషాకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి పెన్షన్‌లు మంజూరు చేయాలని సీపీఎం మండల నేత బెజవాడ తాతబ్బాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పెన్షన్‌లు ఇవ్వాలని కోరుతూ చనుపల్లివారిగూడెంలో గురువారం సంతకాల సేకరణ చేసి సచివాలయ కార్యదర్శి మమతకు అందజేశారు. తాతబ్బాయి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 మాసాలు గడస్తున్నా, కొత్త పెన్షన్‌లు మంజూరు చేయలేదన్నారు. అర్హులైన వారు చాలా మంది ఉన్నారని, ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎం నాయకులు శివకుమార్, సుబ్బయ్య, కోటేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

గన్నవరం, : విద్యార్థులకు చిన్న నాటి నుంచే ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలని హెచ్‌ఎం హరిశరణ్ అన్నారు. సూరంపల్లి జడ్పీహైస్కూల్‌లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ధూమపానం - ఆరోగ్యంపై ప్రభావం అంశంపై గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను సరైన దిశలో నడిపించాలి

ఉంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తును సరైన దిశలో నడిపించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్ చాలా అవసరమని ఎన్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు అశోక్‌కుమార్, శివలక్ష్మి అన్నారు. కౌన్సెలింగ్, గైడెన్స్ సర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం తేలప్రోలు జడ్పీ హైస్కూల్‌ను ప్రతినిధుల బృందం సందర్శించింది. కౌన్సెలింగ్, గైడెన్స్ గురించి అవగాహన కల్పించి, పాఠశాల స్థాయిలో ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. విద్యార్థులు ఎల్లప్పుడు ఆత్మవిశ్వాసంతో వుండాలన్నారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలో కౌన్సెలింగ్ అమలు తీరును చర్చించారు. ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధు అశోక్‌కుమార్, శివలక్ష్మి, హనుమాన్‌రాజు, జిల్లా జీసీడీవో జి.సీతామహాలక్ష్మి, రాష్ట్ర సమగ్ర శిక్ష కోఆర్డినేటర్స్ కేపీ వెంకటసుబ్బయ్య, ఛాయేంద్రకుమార్, కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సెలర్ జి.నరేష్, పాఠశాల హెచ్‌ఎం వి.వి.ఆదిలక్ష్మి, డైట్ లెక్చరర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



తేలప్రోలు జడ్పీహైస్కూల్‌ను సందర్శించిన ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిథుల బృందం

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

కంకిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గన్నవరం రోడ్డు డ్రైనేజీ సమస్య ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో పూర్తి కావడం హర్షనీయమని ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటి సభ్యులు కొండా నాగేశ్వరరావు అన్నారు. గన్నవరం రోడ్డులో సుమారు రూ. 15 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో నియోజకవర్గంలో సుమారు రూ. 100 కోట్లతో అభివృద్ధి జరిగిందని తెలియజేశారు. రానున్న రోజుల్లో మరో రూ. 100 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలియజేశారు. కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.2 లక్షలవిరాళం

హనుమాన్‌జంక్షన్,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాపులపాడు శివాలయం ప్రాంగణంలో అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం జంక్షన్‌కు చెందిన వేమూరి హరిబాబు తన తండ్రి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.2లక్షలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడపాటి రత్నశేఖర్, కమిటీ సభ్యులువెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు దాతను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో గణితం పట్ల మక్కువ పెరగాలి

కానూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో గణితం పట్ల మక్కువ పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరులోని సిద్ధార్థ వర్సిటీలో గణిత సమస్యలను పైథాన్ సహాయంతో పరిష్కరించే విధానంపై రెండు రోజులపాటు జరిగే వర్క్‌షాప్ గురువారం ప్రారంభమయింది. గణితం అన్ని ఇంజనీరింగ్ శాఖలకూ ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్‌కు మూలాధారమన్నారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ గణితానికి సంబంధించిన పలు అంశాలను లోతుగా చర్చిస్తామన్నారు. దేశంలోని పలు కళాశాలల నుంచి 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డి. వెంకట్రావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం. సునీత, గణితశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ బేబీరాణితోపాటు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఉయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, చట్టరీత్యా నేరమని ఉయ్యూరు రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు అన్నారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆకునూరు ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల దుష్పలితాలు, చట్టరీత్యా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకునేందుకు బాల్యవివాహాలు ఆటంకంగా నిలుస్తాయన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ, బాల్య వివాహాల సమాచారం ప్రభుత్వ ఉద్యోగులకు అందించాలన్నారు. ఎంఈవో సుధారాణి, సీడీపీ సూపర్‌వైజర్ బేబీసరోజిని, హెచ్‌ఎం శ్రీధర్, ఎంపీటీసీ తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొని విద్యార్థులతో బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

కంకిపాడు: విద్యార్థి దశలోనే బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళీకృష్ణ అన్నారు. కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణం పోలీసులకు, అంగన్వాడీ కార్యకర్తలకు తక్షణం సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కంకిపాడు ఎస్సై తాతాచార్యులు, పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై సురేశ్‌బాబు



ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి తదితరులు

ఆరు నెలల్లో ఆర్వోబీ నిర్మాణం పూర్తి

● ఎంపీ బాలశౌరి

గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుడివాడ ప్రజల చిరకాల కోరిక రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, 6 నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. గురువారం పెద్దకాలువ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్‌ను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని, ఆయా పనులను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే వెనిగండ్ల పరిశీలిస్తున్నారన్నారు. అధికారులు తెలిపిన చిన్నపాటి సాంకేతిక సమస్యలు 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు నిర్మాణానికి రూ.20కోట్లతో ప్రతిపాదనలు పంపడం పంపామని, త్వరలో ఆమోదం పొందనున్నట్టు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ అధికారులు ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. జాతీయ రహదారుల శాఖ డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్ర, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నేతలు జగన్మోహనరావు, నిమ్మగడ్డ సత్యసాయి, యార్లగడ్డ సుధారాణి, సాయన రాజేష్, వేమూరి త్రినాథ్, సందు పవన్, పంచకర్ల అమర్, ఆర్జా మోనాలిసా, వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎల్ఎం మావ్య సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్‌కుమార్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు: జేసీ

ఉయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, తేమశాతానికి సంబంధించి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని జేసీ ఎం నవీన్‌కుమార్ మిల్లర్లకు సూచించారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ మండలాల పరిధిలో రైస్ మిల్లర్లతో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించి ధాన్యం సేకరణకు సంబంధించి పలు అంశాలపై సూచనలు చేశారు. మిల్లుల వద్ద ధాన్యం తేమశాతం, దిగమతి, గోనెసంచుల లభ్యతపై మాట్లాడారు. ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, సివిల్ సప్లైస్ డీఎం టీ శివరామప్రసాద్, తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు


పండించిన ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, పక్వానికి రాని ధాన్యం కోయించి రైతులు తొందడరపడవద్దని జేసీ నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కోతకోసి రాశులు పోసి, గోనెసంచుల్లో నిల్వ ఉంచిన ధాన్యం మిల్లులకు పంపేందుకు రైతుల ఇబ్బందులను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన మన ప్రాంతానికి తుపాను ముప్పు ఉండదని వాతావరణ శాఖ సమాచారం ఉందన్నారు. రైతులు తొందరపడి కోత కోయించవద్దన్నారు.



చెరువు కట్టలు తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

వివాదాస్పద చెరువుపై కట్టల తొలగింపు

చల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం శివారు చింతలమడలోని డ్రెయినేజీ పోరంబోకు భూముల్లో వివాదాస్పద చెరువు సమస్య ఓ కొలిక్కివచ్చింది. చెరువు తవ్వకాన్ని వ్యతిరేకిస్తున్న రైతులు ఆందోళన చేసి కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఎట్టకేలకు అధికారులు చెరువు కట్టలు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువు తవ్వినప్పటికీ దీనిపై అనేక ఆందోళనలు జరిగాయి. అప్పట్లో చెరువు కట్టలు కొంత మేర తొలగించగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చెరువు చుట్టూ కట్టలు పోసి పటిష్ఠపరిచి మత్స్య ఉత్పత్తులు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చింతలమడ, దాలిపర్రు, ఘంటసాల, దేవరకోట, బిరుదుగడ్డ ప్రాంతాల రైతులు చెరువు తవ్వకం, నిర్వహణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. చల్లపల్లి తహసీల్దార్ డీ వనజాక్షి, డ్రైనేజీ ఈఈ కిరణ్‌బాబు, డీఈఈ బాబూనాయక్, ఏఈ చిరంజీవి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్, జేసీబీలతో చెరువు కట్టల తొలగింపు గురువారం ఉదయం చేపట్టారు. పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ, డ్రైనేజీ అధికారులు పనులను పర్యవేక్షించారు. సాయంత్రం వరకూ ఈ ప్రక్రియ సాగింది. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు తూము శ్రీనివాసరావు, ప్రతిమ, హెచ్‌సీ పాండు, రైతులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావు నుంచి వివరాలు సేకరిస్తున్న అలంకార్

సహకార కన్స్యూమర్ సొసైటీ భవనంపై విచారణ

తోట్లవల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ది సౌత్‌వల్లూరు కో-ఆపరేటీవ్ కన్స్యూమర్ స్టోర్స్ లిమిటెడ్ (నెం.హెచ్ 1482) భవనంపై గురువారం సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీ అలంకార్ విచారణ చేశారు. తోట్లవల్లూరు శివారు కలాస్‌మాలపల్లికి చెందిన చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు వందవాసు అచ్చమాంబ ఇటీవల భవనంలోకి ప్రవేశించి కుట్టుమిషన్లు పెట్టి కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయటంతో ఇది అక్రమమని కన్స్యూమర్ స్టోర్స్ అధ్యక్షుడు రావులపల్లి శ్రీనివాసరావు(వాసు) పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అచ్చమాంబ ఈ భవనం పూర్వపు అధ్యక్షుడు గుత్తా మురళీ సంఘానికి ఇచ్చారని, కొంతకాలం వృద్ధాశ్రమం నడిపామని, మాకు హక్కులున్నాయని, న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ పత్రాన్ని కలెక్టర్ గుడివాడ డివిజినల్ సహకార అధికారికి పంపించగా ఆయన ఆదేశంతో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అలంకార్‌ను విచారణాధికారిగా పంపించారు. స్టోర్‌కు వచ్చిన అలంకార్.. అధ్యక్షుడు శ్రీనివాసరావును, అచ్చమాంబని పిలిపి వారి నుంచి సమాచారం సేకరించారు. ప్రస్తుత పాలకవర్గం నుంచి అనుమతి తీసుకుని భవనంలోకి వచ్చి ఉంటే సమస్య ఏర్పడేది కాదని విచారణాధికారి అచ్చమాంబకు సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఈ భవనంలో ప్రారంభించాల్సి ఉందని, గోనె సంచులు, మొక్కజొన్న లోడులు నిల్వ చేసేందుకు భవనం అవసరమని అధ్యక్షుడు శ్రీనివాసరావు వివరించారు. ఇద్దరి వాదనలు అలంకార్ నివేదికను గుడివాడ డివిజినల్ సహకార అధికారికి నివేదిస్తానని చెప్పారు.



ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల



గన్నవరం విమానాశ్రయం

గ్రేటర్‌కు గన్నవరం

● గ్రేటర్ విజయవాడలో విలీనానికి గన్నవరం గ్రామాల ఏకగ్రీవ తీర్మానాలు ● కేంద్ర విద్యాసంస్థలకు కేంద్రంగా కొండపావులూరు ● స్టీల్ హబ్‌గా మారిన గన్నవరం
● పర్యాటక, ఆధ్యాత్మికధామం బ్రహ్మయ్యలింగం చెరువు ● అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరం సొంతం ● పారిశ్రామికంగా అభివృద్ధి ● మెట్రో రైళ్లు మొదలయ్యేది ఇక్కడి నుంచే

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న గన్నవరం ప్రాంతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కేంద్రంగా ఉంది. వీరపనేనిగూడెం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటైంది. పారిశ్రామిక పర్యాటకాభివృద్ధికి బ్రహ్మయ్యలింగం చెరువు ఉంది. అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. మేధా టవర్, హెచ్‌సీఎల్ వంటి ఐటీ సంస్థలతో టెక్‌వాడగానూ రూపాంతరం చెందింది. ఇప్పుడు గోకార్టింగ్‌తో వినోద కేంద్రంగానూ మారింది. ఈవీ కార్ స్టేషన్, మంచి ఫుడ్ ఇచ్చే బడ్జెట్ హయ్యెండ్ రెస్టారెంట్స్‌తో గన్నవరం ముఖచిత్రం కొత్తగా మారుతోంది. గ్రేటర్ విజయవాడలో విలీనం కావటానికి అంగీకారం తెలుపుతూ తీర్మానం చేసిన గన్నవరం ప్రాంతంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. - ఆంధ్రజ్యోతి, గన్నవరం

గన్నవరం మండలంలోని కొండపావులూరు కేంద్ర విద్యాసంస్థలకు కేంద్రంగా ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం సంస్థ ఏర్పాటు జరిగింది. సమీపంలో ఉన్న సూరంపల్లిలో ప్లాస్టింగ్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన కాలేజీ సీపెట్ ఏర్పడింది. అలాగే గన్నవరం స్టీల్ హబ్‌గానూ మారింది. టాటా, వైజాగ్ స్టీల్ యార్డులు ఏర్పాటయ్యాయి. స్టీల్ కోసం ఇతర ప్రాంతాలకి వెళ్లే పని లేకుండా అందుబాటులో ఉంది. వందలాది మంది కార్మికులకు ఉపాధి లభిస్తోంది. గన్నవరం - నూజివీడు ప్రధాన రోడ్డుకు సమీపంలో గన్నవరం రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో స్టీల్ హబ్ ఏర్పడింది. విద్యాలయాలకు సైతం గన్నవరం కేంద్రంగా ఉంది. మెడికల్, పశువైద్య, ప్రతిష్ఠాత్మక టెక్నికల్ విద్యా సంస్థలున్నాయి. చిన అవుటపల్లిలో మెడికల్ కళాశాల, డెంటల్, నర్సింగ్, పారా మెడికల్ కోర్సులున్నాయి. కేసరపల్లిలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఉంది. దావాజీగూడెంలో ఎన్‌టీటీఎఫ్ కళాశాల ఎన్టీఆర్ హయాంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఇలాంటి కళాశాల మరెక్కడా లేదు. దేశవ్యాప్తంగా వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు.



ఆధునాతనంగా రూపాంతరం చెందుతున్న గన్నవరంలోని ప్రధాన సెంటర్



బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం

పర్యాటక, ఆధ్యాత్మికధామం

రాష్ట్రంలోనే అతి పెద్ద చెరువుల్లో ఒకటైన బ్రహ్మయ్యలింగం చెరువు ఇక్కడే ఉంది. ఈ చెరువు కొండలు, మామిడితోటల వెంబడి ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రకృతి సోయగాలు వర్ణించలేనివి. చారిత్రక బ్రహ్మకైలాసం ఇక్కడే ఉంది. బ్రహ్మయ్యలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎంతో మంది పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ బోటింగ్ కార్యకలాపాలకు అవకాశం ఉంది. ట్రెక్కింగ్ కూడా చేయవచ్చు.

అంతర్జాతీయ విమానాశ్రయం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరంలోనే ఉంది. ప్రస్తుతం శాశ్వత ప్రాతిపదికన దేశీయ, అంతర్జాతీయ టెర్మినల్ బిల్డింగ్ రూపుదిద్దుకుంటోంది. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఏటీసీ టవర్, కొత్త ఆప్రాన్, ప్రధాన రోడ్ల పనులు కూడా పూర్తయ్యాయి. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి సింగపూర్, షార్జాలకు విదేశీ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. దేశీయంగా 46 సర్వీసులు నడుస్తున్నాయి.

గోకార్టింగ్‌లో యువత చక్కర్లు

బీబీగూడెం సమీపంలో ఎక్స్‌ట్రీమ్ గోకార్టింగ్ ఏర్పాటైంది. దీంతో ఇక్కడ మంచి వినోద కేంద్రం ఏర్పడింది. గోకార్టింగ్‌లో యువత సందడి చేస్తున్నారు. బైపాస్‌కు సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇది ఉండటంతో ఎక్కువ మంది యువత చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్నారు. సాయంత్రం, సెలవు దినాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది.



ప్రధాన సెంటర్ అభివృద్ధి

గన్నవరం ప్రధాన సెంటర్ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. సుమారు రూ.1.50 కోట్లతో పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో ఈ పనులు ప్రారంభమయ్యాయి. మూసుకుపోయినట్టు ఉండే సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి విశాలంగా చేశారు. గతంలో ఇక్కడున్న ఎన్టీఆర్, గాంధీ విగ్రహాలను పెద్దవిగా ఏర్పాటు చేస్తున్నారు. పనులు పూర్తయితే సెంటర్‌కు మంచి లుక్ వస్తుంది.

పారిశ్రామికంగా అభివృద్ధి

గన్నవరం ప్రాంతం పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందుతోంది. వీరపనేనిగూడెంలో ఇండస్ట్రియల్ పార్క్ మణిహారంగా ఉంది. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ)లో గన్నవరం పారిశ్రామిక నోడ్‌గా గుర్తించారు. భవిష్యత్తులో గన్నవరం మరింతగా పారిశ్రామికంగా ఎదగటానికి అవకాశం ఉంది.

మెట్రో రైళ్లు మొదలయ్యేది ఇక్కడి నుంచే..

విజయవాడ మెట్రో ప్రాజెక్టులో భాగంగా గన్నవరం నుంచే మెట్రో రైళ్ల పరుగులు పెట్టబోతున్నాయి. కోచ్ డిపో ఏర్పాటుకు సైతం స్థల పరిశీలన జరుగుతోంది. భూ సేకరణ సమస్యలు లేకుండా ప్రభుత్వ భూములను గుర్తించారు.

జీజీహెచ్‌లో లీనార్ ఏర్పాటుకు కృషి

త్వరలో కేన్సర్ చికిత్సకు పరికరం ఏర్పాటు ● నర్సింగ్ విద్యార్థుల సమస్యల పరిష్కరిస్తాం ● మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు

విజయవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో కేన్సర్ వైద్య సేవలను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా లీనక్ (లీనియర్ యాక్సిలరేటర్) పరికరాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు తయారుచేయాలని మంత్రి సత్యకుమార్ ఉన్నతాధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గా ఉన్న సత్యకుమార్ కలెక్టరేట్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావుతో గురువారం సమావేశమై జీజీహెచ్ అభివృద్ధి గురించి చర్చించారు. కేన్సర్ వైద్యసేవలకు అవసరమైన లీనక్ పరికరాన్ని జీజీహెచ్‌లో అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ లీనక్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్థిక సహకార మార్గాలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను ఆదేశించారు. కేన్సర్ కణాలను నాశనం చేసేందుకు ఉపయోగించే ఈ పరికరం ఏర్పాటుకు ప్రత్యేక బంకరును ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సి ఉందని, సుమారు రూ.20 కోట్లు ఖర్చువుతుందని అధికారులు మంత్రికి వివరించగా ప్రక్రియను పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.

నర్సింగ్ విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి హామీ

ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ విషయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఔషధ నియంత్రణ శాఖ భవనాన్ని ఉపయోగించుకునేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని మంత్రి చెప్పారు. త్వరలోనే ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్త, పాత ఆసుపత్రుల్లో అభివృద్ధి పనులకు రూ.80 కోట్లు అవసరముందని ప్రజాప్రతినిధులు మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి పీజీ వైద్య సీట్ల పెంపునకు తగ్గట్టు కేంద్రం నుంచి వచ్చిన నిధుల వినియోగం, జీజీహెచ్ చేపట్టిన పనుల వివరాలు ఇవ్వాలని డీఎంఈను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ, డీఎంఈ డాక్టర్ రఘునందన్, ఏడీఎంఈ డాక్టర్ వెంకటేష్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరిండెంటెండ్ డాక్టర్ బాబ్జీ శ్యామ్, అంకాలజిస్ట్ హెచ్‌వోడీ నెహ్రూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు సెల్ఫీ వీడియో కలకలం

● కూటమి నేతలు వేధిస్తున్నారంటూ విడుదలైన వీడియో వైరల్

అవనిగడ్డ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి మండలంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కొడాలి రాజేష్ దళితుడైన తనను కొందరు కూటమి నేతలు, సహచర ఉద్యోగులు వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపిన వీడియో నెట్టింట వైరల్‌గా మారి కలకలం సృష్టిస్తోంది. మోపిదేవి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పేకాట, రేషన్ బియ్యం అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పేరుతో కొందరు చోటా నేతలు, ఇద్దరు హోంగార్డులు, ఒక హెడ్ కానిస్టేబుల్, మరికొందరు వేధిస్తున్నారని, ఎమ్మెల్యే కుటుంబసభ్యుల సహకారం ఉందని సెల్ఫీ వీడియో జిల్లా ఉన్నతాధికారులకు పంపాడు. తనకేదైనా అయితే రేషన్ మాఫియానే కారణమని, ఇప్పటికే చంపుతామంటూ బెదిరించారని ఆ వీడియోలో ఆరోపించారు.

ఈ వీడియో బయటకు ఎలా వచ్చింది?

హోంగార్డు రాజేష్ తనపై జరుగుతున్న అణచివేతపై తీసిన సెల్ఫీ వీడియో ఉన్నతాధికారులకు పంపిస్తే బయటకు ఎలా వచ్చిందన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాన్ని బద్నామ్ చేసేందుకా? ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు రాజకీయ మరకలు అంటించే కుట్రలో భాగంగా జరిగిందా? అన్న విషయమై చర్చ సాగుతోంది. బుధవారమే వీడియో బయటకు వచ్చిందని, గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటం వెనుక వైసీపీ హస్తం ఉందా? అన్నకోణంలో చర్చ సాగుతోంది.

సమగ్ర విచారణ జరుపుతాం

మచిలీపట్నం టౌన్: హోంగార్డు సెల్ఫీపై విచారణ జరుపుతామని ఎస్పీ వీ విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న హోమ్‌గార్డు సెల్ఫీ వీడియోపై ఎస్పీ మాట్లాడారు. విధి నిర్వహణలో సహ ఉద్యోగుల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయంటూ హోంగార్డు ఆవేదన చెందిన అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆదేశించామని, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు

జి కొండూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఇరువురు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి పీ లావణ్య కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో భారీ అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని గంగినేనిపాలెం పంచాయతీలో 2021 నుంచి సాధారణ నిధులు రూ.16,61,480, 17వ ఆర్థిక సంఘం నిధులు రూ.37,50,388 కలిపి మొత్తం 53,728,68కు సంబంధించి రికార్డులు నిర్వహించలేదని, ఖర్చులు కూడాచేపయలేదని నిర్ధారించారు. దీంతో సర్పంచ్ పీ రామారావు చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. 3 నెలల వరకూ ఈ విధులను జీ కొండూరు మండల పరిషత్ అధికారికి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే దుగ్గిరాలపాడు పంచాయతీ నిధులు దుర్వినియోగానికి గురైనట్టు డీపీవో నిర్ధారించారు. 2021 నుంచి పంచాయతీ సాధారణ నిధులు 12,38,450, 15వ ఆర్థిక సంఘం నిధులు 12,28,597 మొత్తం 24,67,047 నిధుల రికార్డుల నిర్వహణ, వినియోగంలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలపై జరిపిన విచారణలో నిగ్గుతేలడంతో సర్పంచ్ జడ రాంబాబు చెక్ పవర్ రద్దు చేశారు. 3 నెలల వరకూ ఈ హక్కులను మండల పరిషత్ అభివృద్ధి అధికారికి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు పంచాయితీలకు రామారావు కార్యదర్శిగా పని చేస్తున్నారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

ఇసుక కొరత లేకుండా చూడండి: కలెక్టర్



మచిలీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో జిల్లాలోని ఇసుకరేవుల నుంచి ఇసుకను తవ్వి ఇసుక పాయింట్లలో నిల్వచేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో గురువారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ నిర్మాణ పనుల అవసరాలకు పూర్తిస్థాయిలో ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. రానున్న రోజుల్లో ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం అనుమతులున్న ఇసుకరేవులతో పాటు మరో నాలుగు ఇసుకరేవుల నుంచి ఇసుకను తవ్వే అంశంపై పూర్తిస్థాయి పరిశీలన చేసి త్వరగా అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ 4 ఇసుకరేవులకు త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఇసురేవుల్లో 8 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని భూగర్భగనులశాఖ అధికారులు తెలిపారు. ఏఎస్పీ సత్యనారాయణ, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, భూగర్భగనుల శాఖ ఏడీ శ్రీనివాసరావు, జియాలజిస్ట్ కొండారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులివ్వండి

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో గురువారం జిల్లా ఎగుమతుల ప్రోత్సాహకమండలి సమావేశం జరిగింది. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనువైన ప్రాంతమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి సింగిల్‌విండో పద్ధతిలో త్వరగా అనుమతులు మంజురు చేస్తామన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా 120 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 30 మందికి మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, వచ్చే సమావేశం నాటికి అందరికీ రుణాలు మంజూరు చేయాలని బ్యాంక్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లీగల్‌మెట్రాలజీ విభాగం వద్ద 18, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు వద్ద 14, ఏపీఐఐసీవద్ద 13, గ్రౌండ్‌వాటర్ విభాగం వద్ద మూడు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో 26 యూనిట్ల స్థాపనకు రూ.4.30కోట్లను రాయితీగా మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వెంకట్రావు, అగ్నిమాపకశాఖ అధికారి ఏసురత్నం, మార్కెటింగ్ విభాగం ఏడీ నిత్యానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. సిహెచ్ నరసింహులు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాధరావులు దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ చైర్మన్ ఈడే మోహన్, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావులు సన్మానించారు.



కొండలమ్మను దర్శించుకున్న పశుసంవర్ధకశాఖ జేడీ నరసింహులు

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనీ, రైతులు దళారులను నమ్మి నష్టపోవద్దని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడ్లవల్లేరులో ఆరబెట్టిన ధాన్యపు రాశులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు అపోహ పడవద్దని తొందర పడి నేరుగా మిల్లర్లు,వ్యాపారుల వద్దకు నేరుగా వెళ్లి నష్టపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కౌతవరం, పశుబోట్లపాలెం గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని కొనడం లేదంటూ ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ప్రభుత్వం కొనుగోలు చేయదేమోనన్న సందేహాలను పలువురు రైతులు వ్యక్తం చేశారు. కాగా కొందరు రైతులు దళారుల ద్వారా రైస్‌మిల్లులకు ధాన్యన్ని నేరుగా విక్రయించే ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే గ్రహించారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను రాము రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రంలో కస్టోడియన్ అధికారుల ద్వారానే మిల్లర్ల వద్దకు వెళ్లాలని ఆయన వివరించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి మిల్లు వద్ద ఒక కస్టోడియన్ ఆఫీసర్‌ను నియమించిందని ఆయన అన్నారు. ఏదైనా సమస్య వస్తే రైతులు వారికి వివరిస్తే వారు సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అధికారులు ఎన్ని పని ఒత్తిళ్లు ఉన్నా రైతుల సమస్యలను పరిష్కారానికి చొరవతీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. గుడ్లవల్లేరు, కౌతవరం, వెణుతురుమిల్లి గ్రామాల్లో రైతన్నా -మీకోసం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కరపత్రాలను ఎమ్మెల్యే, కూటమి నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు టీడీపీ మండల అధ్యక్షుడు బాపయ్య చౌదరి, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, శాయిన పుష్పావతి, పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పామర్రు: వ్యవసాయరంగాన్ని లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా అమలు చేస్తున్న పంచసూత్రాల సమగ్ర సమాచార ఉద్యమం గ్రామాల్లో రైతాంగానికి స్వర్ణయుగంలాంటిదని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం రాపర్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి, పంచసూత్రాలతో మీకోసం రైతన్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నీటిభద్రత, డిమాండ్ ఆధారితపంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, అన్నదాతసుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలతో రైతన్నలకు ప్రభుత్వం అందించే మద్దతును రైతన్నల ఇంటింటా అధికారులతో కలిసి వివరించారు. పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత మాట్లాడుతూ, పెట్టుబడిఖర్చులను తగ్గింపు కోసం గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఏవో వి.శివనాగరాణి పంచసూత్రాలను కేవలం పంట రైతులకేకాక, పాడి రైతులు, ఆక్వా, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులకు వర్తించే విధంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఏఏ, రైతులు, పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



వెణుతురుమిల్లిలో రహదారిని ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2 వేల కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. గురువారం గుడ్లవల్లేరు మండలంలో వెణుతురుమిల్లిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. వెణుతురుమిల్లి, దేశాయగుంట గ్రామాల్లో రూ. 32.09 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులుతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వెణుతురుమిల్లి సర్పంచ్ కొప్పినేని శేషవేణి, కొప్పినేని పిచ్చేశ్వరరావు, చందన వెంకటరాజు, రాజేష్, హరిబాబు, గణేష్, ఫణి, అనిల్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు డిప్యూటీ ఎంపీడీవోగా ఎలీషారావు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు సచివాలయాల పర్యవేక్షణకు డిప్యూటీ ఎంపీడీవోగా ఎలీషారావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎలీషారావు ఇప్పటివరకూ అంగలూరు,కూరాడ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించిందని ఎంపీడీవో ఇమ్రాన్ తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా, మదనపల్లి సీయమ్‌టీ పాఠశాలలో 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాస్కెట్ బాల్ పోటీలను ఈ నెల 24 నుంచి 26వ తేదీవరకు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి,ప్రతిభ చాటి ఎ.జనవిక రక్ష బంగారు పతకాన్ని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక పాఠశాల ఆవరణలో క్రీడాకారిణి జనవిక రక్షకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. క్రీడాకారిణి రక్ష, కోచ్ మడకా సత్యఅన్వేష్‌లను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

కోటి సంతకాల సేకరణ

గుడివాడ : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణను వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మమద్ ఖాసిం(అబూ)ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ముబారక్ సెంటర్‌లో చేపట్టారు. నాయకులు షేక్ బాజీ, షమ్ము, భాషా, చుండూరి శేఖర్, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్నే తీసుకురావాలి

● ఏడీఏ సునీల్

పమిడిముక్కల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టి నిర్ణీత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్నే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని గన్నవరం ఏడీఏ సునీల్ రైతులకు సూచించారు. కపిలేశ్వరపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డితో కలసి గురువారం సందర్శించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంట కోతకోసిన తరువాత పచ్చిధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం, నిర్ధేశిత ప్రమాణాల మేర ఉన్నప్పుడే తీసుకురావాలని సూచించారు. ప్రతి రైతూ పంట కోతకోయడానికి ముందే రైతు సేవాకేంద్రం ద్వారా వ్యవసాయశాఖ అధికారులకు తెలియపరచాలన్నారు. పారదర్శక మైన కొనుగోలు వ్యవస్థ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు తమ ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వానికి కనీస మద్దతు ధరకు విక్రయించే అవకాశం కల్పించామన్నారు. మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా లాభం అందేలా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ దీప్తి

గుడివాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వస్తాయని, ప్రజలు భయపడవద్దని మండల వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి అన్నారు. గురువారం తట్టివర్రులో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 100 మంది రోగులు వైద్యం చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గర్భిణులు , బాలింతలు వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. నిల్వ ఉన్న పచ్చళ్లు, కూరలు తినకుండా ఉండాలని చెప్పారు. ఎప్పటికప్పుడు, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని ఏఎన్ఎంలు ప్రతిరోజూ వస్తారని, వారి సేవలు వినియోగించుకోవాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు సమయం ప్రకారం మందులు వేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా మోటూరు పీహెచ్‌సీని, సబ్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. అవసరమైనప్పుడు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేస్తామని తెలిపారు. ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తట్టివర్రులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దీప్తి

ఎన్‌జీవోస్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

గుడివాడ, నవంబరు27(ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీవోస్ అసోసియేషన్ గుడివాడ తాలుకా యూనిట్ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. గురువారం స్థానిక ఎన్‌జీవోస్ భవన్‌లో అసోసియేషన్ జిల్లా నాయకులు షేక్ ఫరీద్‌భాషా ఎన్నికల అధికారిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లి కృష్ణ పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల నిర్ణీత సమయానికి కేపీ రావు, జి.రాజేంద్రప్రసాద్‌ల ప్యానల్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఎవరు నామినేషన్లు దాఖలుచేయకపోవడంతో కేపీ రావు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఫరీద్‌భాషా ప్రకటించారు. అసోసియేషన్ గుడివాడతాలుకా యూనిట్ ఉపాధ్యక్షుడిగా తాడి పాపయ్య, సంయుక్త కార్యదర్శులుగా నిర్మల, విద్యావతి, కె.మనోజ్, టి.వెంకట్రాది, ఎస్.రమేష్, తదితరులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష,కార్యదర్శులు కె.పిరావు, జి.రాజేంద్రప్రసాద్, ఇతర కమిటీ సభ్యులను అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి ఏ.వెంకటేశ్వరరావు, ఎన్‌జీవోస్ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.



ఎన్‌జీవోస్ గుడివాడ తాలుకా యూనిట్‌కార్యవర్గం

అంగన్వాడీ కేంద్రాల్లో కొరవడిన పర్యవేక్షణ

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలపై ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఉలవలపూడి సర్పంచ్ కన్నెభాస్కరరావు ఆరోపించారు. గురువారం గుడ్లవల్లేరు మండల సమావేశాన్ని ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. తమ గ్రామంలోని అంగన్వాడీలో పురుగులు పట్టిన కదిపప్పు వస్తే అదే వండి పిల్లలకు పెట్టేస్తున్నారని అదేమని ప్రశ్నిస్తే తమకు వచ్చిన పప్పునే వండి పెడుతున్నామంటూ అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని సర్పంచ్ కన్నెభాస్కరరావు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి స్పందిస్తూ తాము ఇకపై అంగన్వాడీల్లో పర్యవేక్షిస్తామని, తనిఖీలు చేస్తామన్నారు. చింతలగుంటలో పాఠ శాల నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియడం లేదన్నారు. దీనికి ఎంఈవో 2 వేణుగోపాల్ స్పందిస్తూ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధుల మంజూరు కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్, తహసీల్దారు లోకరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీరున్నీసా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ భాస్కరరావు

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

●ఎంఈవో బాలాజీ

గుడివాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో బాలాజీ ఉపాధ్యాయుకు సూచించారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో ఎంఈవో, ఉపాధ్యాయులు కలసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రతీ పాఠశాల ఆవరణలో మొక్కలునాటి సంరక్షించాలని కోరారు. చదువుతోపాటు ప్రకృతి విలువలు విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఏయే మొక్కల వల్ల ఉపయోగాలు ఉన్నాయో తెలియజేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● వి.బి.కే.బి సుబ్బారావు

గుడ్లవల్లేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పశువైద్యశాలలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాలుత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వి.బి.కేబి సుబ్బారావు సూచించారు. పశుబొట్లపాలెంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ద్వారా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎదకి రాని పశువులకు, సాధారణ పశువులకు పశువైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. పశువులకు మినరల్ మిక్చర్‌ను మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి,గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతులమీదుగా రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సిహెచ్ నరసింహులు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగన్నాధరావు, గుడ్లవల్లేరు పశుసంవర్ధక శాఖ డివిజన్ ఉపసంచారకులు డాక్టర్ సి.శ్రీనివాసరావు, ఏడి డాక్టర్ శ్రీనివస్, పశువైద్యురాలు డాక్టర్ బి.శ్రీవీణపాల్గొన్నారు.



పశువైద్య శిభిరాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారావు

వివాహిత కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దాలిపర్రుకు చెందిన వెంకటేశ్వరరావు భార్యతో కలిసి ఈ నెల 24వ తేదీన తమ గ్రామం నుంచి భీమవరం వెళ్లేందుకు గుడివాడ బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సు బయలుదేరేందుకు సమయం ఉండటంతో భర్త వెంకటేశ్వరరావు టాయిలెట్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బస్సులో కూర్చుని ఉన్న భార్య కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం అందలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

అంగన్వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు: యాకమూరు అంగన్వాడీ కేంద్రం-1లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టుకి అర్హతగల వారు డిసెంబర్ 3వ తేదీలోపు పామర్రు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో బి ఉషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీకి చెందిన వారైతే 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని, 2025 జూలై 1కి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు.

వాతావరణంలో మార్పులు ..ఆందోళనలో అన్నదాతలు

గుడివాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలంలో రైతులు వివిధ రకాల పనులతో బిజీగా ఉన్నారు. రాబోయే రెండు రోజుల్లో వాతావరణ శాస్త్రవేత్తలు, అధికారులు వర్షాలు కురుస్తాయని తెలపటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ కారణంగా వరి ధాన్యం రంగు మారిపోయింది. దీంతో రైతులకు చాలా నష్టం వాటిల్లింది. వరి కోతలు మిషన్ల ద్వారా కోస్తున్నారు. వాటిని ఇళ్ల వద్ద గుట్టలు పోస్తున్నారు. ఈసారి వర్షం వస్తే రైతులకు అపార నష్టం వాటిల్లుతుందని రైతులు భయపడుతున్నారు. వర్షం రాకముందే వరి కోతలు కోసి కొంత రాశులుగానీ, ఇళ్ల దగ్గర గానీ పోసుకోవాలని ఆత్రుతతో రైతులు పొలాల వెంట పరుగులు పెడుతున్నారు. వరి కోతలు కోసే మిషన్లు దొరకక రైతులు పడిగాపులు పడుతున్నారు. ఒక్క మిషన్ కోసం ఐదారుమంది రైతులు క్యూ లో నిల్చుంటున్నారు. వరి కోత కోసే మిషన్లు తక్కువగా రావటం, డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఎంతైనా చెల్లించి ధాన్యం పండించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వాతావరణం గత రెండు రోజులుగా మేఘావృతం కావటంతో రైతులు ఆందోళన చెందిన పండించిన ధాన్యాన్ని చేజిక్కించుకోవటానికి నానా అవస్థలు పడుతున్నారు.



తట్టివర్రులో ఆరుబెట్టిన రంగు మారిన ధాన్యం



దరఖాస్తులు పరిశీలిస్తున్న వైస్ ప్రిన్సిపల్ చింతా రవి బాలకృష్ణ

కూచిపూడి నాట్యంలో ప్రవేశానికి ఇంటర్వ్యూలు

కూచిపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ దరఖాస్తులు పరిశీలించి నాట్య విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2025-26 విద్యాసంవత్సరానికి నాట్య ప్రవేశానికి 133 దరఖాస్తులు అందాయి. సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి 47, డిప్లొమో 30, యక్షగానం 8, సాత్వికాభినయం 10, ఎంపీఏలో ప్రవేశానికి 28 దరఖాస్తులు అందినట్లు వైస్ ప్రిన్సిపల్ తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఎన్.వెంకటేశ్వరరావు, వెంకట దుర్గా భవాని, వై.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


● ఎస్సైలు శిరీష, రాజేంద్రప్రసాద్, సత్యన్నారాయణ

కూచిపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూచిపూడి ఎస్సై పి.శిరీష పేర్కొన్నారు. గురువారం మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఈ విషయాలపై అవగాహన కల్పించటంతోపాటు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.



మొవ్వ జడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పామర్రు: బాల్యవివాహాల నిర్మూలన,బాలల హక్కుల పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందింపజేసుకోవాలని ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడంవల్ల జరిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.



పామర్రు జిల్లాపరిషత్ హైస్కూల్లో..

గుడ్లవల్లేరు : బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మండలంలో పలుగ్రామాల్లో పాఠశాలల్లో గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఆదాయపు పన్ను అధికారి



మోపిదేవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ అధికారి పి.కవిత గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు ఆమెకు అందించారు.

ఎక్స్‌అఫిషియోసభ్యులు ఎవరు!

మచిలీపట్నం నగర పాలక సంస్థలో నిలువెత్తు నిర్లక్ష్యానికి పాలకవర్గం బోర్డులోని పేర్లే ప్రత్యక్ష సాక్ష్యం. ఎక్స్ అఫిషియో సభ్యుల పేర్ల మార్పు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు నెలకొన్నాయి. ప్రభుత్వం మారి, ఎక్స్ అఫిషియో సభ్యులు మారినా బోర్డులో పాతపేర్లే ఉంచారంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతుందో అర్థం చేసుకోవచ్చు.

- ప్రభుత్వం మారినా పేర్లు మార్చని మున్సిపల్ అధికారులు
- మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని పేరుపై అంత ప్రేమెందుకో?



నగరపాలక సంస్థ బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పేర్ని వెంకట్రామయ్య(నాని) పేరు

(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఎమ్మెల్యేలు, ఎంపీ నగర పాలక సంస్థలో ఎక్స్ అఫీషియో మెంబర్లుగా ఉంటారు. ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా వ్యవహరిస్తారు. శాసనసభకు, పార్లమెంటుకు ఎన్నికలు జరిగి 17 నెలు అయ్యింది. మచిలీపట్నం ఎమ్మెల్యేగా కొల్లు రవీంద్ర, ఎంపీగా వల్లభనేని బాలశౌరి ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం వీరివురు మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఎక్స్ అఫీషియో సభ్యులయ్యారు. కౌన్సిల్ సమావేశాల్లో మేయర్ సీటు పక్కన వీరిరువురికి కుర్చీలు కేటాయిస్తారు. ఇది ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ జరిగేదే. ఎమ్మెల్యేగా కొల్లు రవీంద్ర, ఎంపీగా వల్లభనేని బాల శౌరి బాధ్యతలు తీసుకుని 17 నెలలు దాటింది. అయితే నగరపాలక సంస్థ కార్యాలయంలో పాలక మండలి బోర్డులో మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని పేరు ఎక్స్ అఫీషియో మెంబరుగానే ఉంది. పాలకవర్గంలో 50 మందిలో 47 మంది వైసీపీ కార్పొరేటర్లతో పాటు ఐదుగురు కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరందరూ వైసీపీకి చెందిన వారే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నగర పాలక సంస్థ పాలకసభ్యులు ఎక్కువగా ఉండటం వల్ల వైసీపీ నాయకుల హవానే కొనసాగుతోందనే విమర్శలు నెలకొన్నాయి. మరో ఐదు నెలల్లో నగరపాలక సంస్థ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎవరికి కార్యాలయంలో తమ ఉనికిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మూలనపడ్డ ఆర్వో ప్లాంట్



మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఆర్వో ప్లాంటు పాడై ఏడాదయింది. నిత్యం నగర పాలక సంస్థ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. దాహం వేస్తే ఆర్వో ప్లాంటు వద్ద మంచినీరు తాగేవారు. కార్యాలయంలోని ఉద్యోగులు కూడా ఆర్వో ప్లాంటులోని మంచినీరు శుభ్రంగా ఉంటాయని తాగుతున్నారు. ఆర్వో ప్లాంటు పాడై ఏడాదయినా పట్టించుకునే నాథుడు లేడు. పాలకులు గట్టిగా అడగటం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖకు చెందిన అధికారులను అడిగితే ఎప్పటికప్పుడు చేస్తాం.. చేస్తాం అంటూ కాలం గడిపేస్తున్నారు. రిపేర్లకు ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేట్లు ఇంకా వేస్తూనే ఉన్నారు. ఆర్వో ప్లాంటును బాగు చేయించాలని మునిసిపాలిటీకి వచ్చే ప్రజలు కోరుతున్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

వేకనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అవనిగడ్డ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేకనూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, కూటమి ప్రభుత్వం రైతును రాజుగా చేయాలనే ఆలోచనలో ఉందని తెలిపారు. రైతులకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఏడీ జయప్రద, పీఏసీఎస్ అధ్యక్షుడు మాదివాడ రత్నారావు, ఏవో శుభహారిక, రైతు ఉత్పత్తిదారుల సంఘం తరఫున భరద్వాజ్, వీఏవో రజీనా పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై మూడోరోజూ విచారణ

మోపిదేవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి మత్స్యకారుల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నాడు - నేడు నిధుల గోల్‌మాల్ ఘటనపై ఉన్నతస్థాయి అధికారుల విచారణ మూడో రోజు గురువారం కొనసాగింది. డీవైఈవో శేఖర్ సింగ్ విచారణాధికారిగా సమగ్ర శిక్షా అభియాన్ ఇంజనీరింగ్ అధికారుల బృందం విచారణ చేపట్టారు. విడుదలైన నిధులు, చేపట్టిన పనుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు డీవైఈవో తెలిపారు. పేరెంట్స్ కమిటీ తీర్మానాలు, నిధులు డ్రా చేయటానికి రాసిన చెక్కులు వివరాలు, సీఎంసీ కమిటీ సభ్యులు సంతకాలు ఉన్నది, లేనిది సమగ్రంగా దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. విచారణ పూర్తైన వెంటనే నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.


సాతులూరులో పనల్లోకి వెళ్లిన కాల్వ నీరు

బంటుమిల్లి కాల్వకు గండి - వరి పొలాల మునక

బంటుమిల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి ప్రధాన కాలవకు సాతులూరు గ్రామంలో పలు చోట్ల గండి పడింది. దీంతో వరి పొలాలు తడిసిపోయాయి. ప్రధాన కాలవకు నీరు పూర్తి స్థాయిలో విడుదల చేయడంతో సాతులూరు గ్రామం వద్ద గండ్లు పడ్డాయి. కాలవ గట్లు బురద మయం కావడంతో పాటూ పంట పొలాలు నీటమునిగాయి. రైతులు స్పందించి గండి పూడ్చారు, అధికారులు స్పందించి బలమైన గట్లు వేయాలని, గండ్లు పడకుండా తగు చర్యలు చేపట్టాలని మర్కెట్ యార్డు డైరెక్టర్ వక్కలగడ్డ కరుణకుమార్, రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు.


లోపాముద్ర గోశాలకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు, ధరిత్రి దంపతులు

లోపాముద్ర గోశాలకు శంకుస్థాపన

పెడన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెడనలోని అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో నిర్మించనున్న లోపాముద్ర గోశాలకు గురువారం తెల్లవారుజామున 5.06 గంటలకు సింగరాజు శ్రీనివాసరావు, ధరిత్రీ దంపతులు శంకుస్థాపన చేశారు. హిందూ బంధువుల ఐక్యవేదిక బంధువులు, పెక్కు సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


గంద్రం గ్రామానికి చెందిన అనుమకుమారికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న బూరగడ్డ వేదవ్యాస్

పేదల ఆరోగ్యానికి సీఎం ప్రాధాన్యం : వేదవ్యాస్

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గంద్రం గ్రామానికి చెందిన గుడివాడ అనుమ కుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 4,28,785 చెక్కును టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అందజేశారు. వేదవ్యాస్ మాట్లాడుతూ, అనారోగ్యానికి గురైన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు

అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

కోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్రపు కరకట్టలపై ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణం ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, కామ్రేడ్ పీతా శివన్నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని అమర వీరుల స్మారక సభ నిర్వహించారు. శివన్నాథం స్థూపం వద్ద జెండాను ఎగురవేశారు. భూమి కోసం, భుక్తికోసం ఎంతో మంది అమరులయ్యారని తెలిపారు. సముద్రపు కరకట్టపై ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు పాడయిన కారణంగా వేలాది ఎకరాల్లో పంట వేసుకునే పరిస్థితి లేక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా రైతు కూలీ సంఘ ప్రధాన కార్యదర్శి సింగోతు నాగేంద్రం, రైతు కూలీ సంఘం నాయకులు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య నాయకులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న బండి రామకృష్ణ, చైర్‌పర్సన్ భవానీని అభినందిస్తున్న కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. జగన్నాథ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేవాలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌గా గంపల భవాని, సభ్యులుగా డి. సత్యవాణి, అడపాల సత్యకుమారి, కె. జయలక్ష్మి, భట్రాజు వెంకటమహాలక్ష్మి, ముత్యాలపల్లి సత్యనారాయణ, కె. ఫణీంద్ర, బత్తిన అగస్త్యేశ్వరరావు, తంగిరాల మిధున వ్యాస్, బృందావన సుధీర్‌బాబు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గసభ్యులతో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి మాధవీలత ప్రమాణ స్వీకారం చేయించారు.కొల్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ మాట్లాడుతూ, మహిళలకు చంద్రబాబునాయుడు సరైన ప్రాతినిధ్యం కల్పిస్తున్నారన్నారు. జగన్నాథస్వామి ఆలయ పాలకవర్గంలో ఎక్కువ మంది మహిళలే ఉండటం అభినందనీయమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, 600 ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, ఘంటసాల మార్కెట్ యార్డు చైర్మన్ తోట భవానీ, జోడుగుళ్ళ దేవస్థానం చైర్మన్ దేవసూరి వీరబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, రాము, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. పణికుమార్, నాగేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ లంకిశెట్టి నీరజ, చోడవరపు లక్ష్మీ ప్రసన్న, ఎం.ఉమాదేవి, పాలపర్తి పద్మజ, పి.వి.మలాగాయత్రి, మోపర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మ ఘటం ఊరేగింపు

పెడన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ అమ్మవారి ఘటం ఊరేగింపు ప్రారంభమయింది. మచిలీపట్నంలో రంగుల అలంకరణ పూర్తి చేసుకుని తిరిగి ఇక్కడకు వచ్చే వరకు ఘటం ఊరేగింపు కొనసాగుతుంది. రోజుకో ప్రాంతంలో అమ్మవారి ఘటాన్ని మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తారు. భక్తులు అమ్మవారి టెంకాయలు, పసుపు కుంకుమలు సమర్పించి హారతులిస్తారు. పైడమ్మ ఊళ్లో లేని సమయంలో ఆమె ప్రతినిధిగా ఘటాన్ని ఊరేగించడం ఆనవాయితీ.

కంచాకోడూరులో రైతన్నా..మీకోసం

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంచాకోడూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రైతన్నా: నీకోసం కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోపీ నాగబాబు, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, ఏవో శివరామకృష్ణ, ఎస్ఏ బేగ్, నీటి సంఘం అధ్యక్షుడు కటకం నాగమల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్ కోళ్ల హనుమంతరావు, కట్టా మునేశ్వరరావు, మురాల ధనుష్, శాయన సోమయ్య, కాట్రగడ్డ రత్నబాబు, కాట్రెడ్డి నాగమురళి, కోళ్ళ శ్రీనివాసరావు, పోతుల రాము, రైతులు, పాల్గొన్నారు.


ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు

సీతారామపురంలో..

మచిలీపట్నం టౌన్ : రైతుల కోసం కూటమి ప్రభుత్వం అవిశ్రాంత కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. రైతన్నా నీ కోసం కార్యక్రమంలో కాగిత వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిలుల్లకు వెళ్ళిన 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. బొల్లా వెంకటేశ్వరరావు, ఈదా రాంబాబు, మురారి శ్రీను, పామర్తి కృష్ణ, ఎం. నాగప్రసాద్, పామర్తి శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు అనేకం


మాట్లాడుతున్న పీడీ ఉషారాణి

కోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్.ఉషారాణి అన్నారు. స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల లో విద్యార్థినులకు బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను, వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై చాణక్య, సిహెచ్.స్వాతి, భవాని, పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అవనిగడ్డ : బాల్య వివాహాలు లేని భారతదేశం నిర్మించు కుందామని వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు పిలుపునిచ్చారు. అవనిగడ్డలో గురువారం బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల దుష్ప్రభావాలపై అవగాహన కలిగించేలా వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీఎస్‌డబ్ల్యూ శాంతి, అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో క్యాండిల్ మార్చ్

చల్లపల్లి : బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని చల్లపల్లి ఎంపీడీవో ఆనందకుమారి, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి కోరారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో చల్లపల్లి గురుకుల పాఠశాల/కళాశాలలో క్యాండిల్ మార్చ్, ప్రతిజ్ఞ వేడుకలు నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్(జేఆర్‌సీ) కృష్ణాజిల్లా కో - ఆర్డినేటర్ సిహెచ్.ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డబ్ల్యు ఆర్.దివ్య, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, రైటర్ రమేష్, మహిళా పోలీసులు, ఉపాధ్యాయినిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజా మహోత్సవం

నాగాయలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లిలో బుధవారం రాత్రి దివ్య మహాపడి పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జ్యోతి వెలిగించి పూజలు చేశారు. ఉప్పాల శివశంకరరావు, బోగాది సాంబయ్య, బోగాది విశ్వేశ్వరరావు పడిపూజా మహోత్సవాన్ని నిర్వహించారు. తుర్లపాటి రామ్మోహనరావు అయ్యప్పస్వామికి అభిషేకాలు చేశారు. రాజేష్ నంబూద్రి మహాపడి పూజ, కలశ పూజ జరిపారు. పెడన బాలాజీ గురుస్వామి సుమధుర గాత్రంతో భజన నిర్వహించారు. కాటూరి సుబ్రహ్మణ్యం గురుస్వామి హోమగుండం నిర్వహించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, బోగాది సాయి, పాల్గొన్నారు.

ఉగాదిలోపు గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

చల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు ఉగాదిలోపు ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పోతురాజు కోరారు.చల్లపల్లిలోని ఎన్టీఆర్ కాలనీలో పీఎం ఆవాస్‌యోజన 1.0 పథకం లబ్ధిదారులతో మాట్లాడి వారికి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు వివరించారు.. గృహాలు నిర్మించుకునే అర్హులైన పేదలు ఈనెలాఖరులోపు తమ ఇంటి పట్టా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, అవసరమైన పత్రాలతో దరఖాస్తులను గ్రామ సచివాలయంలో సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఈ ధర్మేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబరు 1 నుంచి లలితా సహస్ర నామపారాయణ



మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చింతగుంటపాలెం నాగేశ్వర స్వామి దేవాలయంలో డిసెంబరు 1 నుంచి 7 రోజుల పాటు నిర్వహించనున్న లలితా సహస్ర నామ సప్తాహ కోటి పారాయణ మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలని మునిసిపల్‌మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో కోటి పారాయణ మహాయజ్ఞం గోడ పత్రికలను ఆవిష్కరించారు. మురళీమనోహర్ శర్మ, కార్యనిర్వహణాధికారి జి.వి. కృష్ణాకుమారి, చిట్టికుమారి, పిప్పళ్ళ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మీన స్థూపం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

నాగాయలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది పుష్కర ఘాట్ వద్ద పునర్నిర్మించనున్న రెండు చేపల ప్రేమ పూర్వక స్థూపానికి మత్స్యకారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి గురువారం శంకుస్థాపన చేశారు. 1970లో దీనిని నిర్మించారని పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధి నాగిడి తాతారావు గుర్తు చేశారు. నాగాయలంక -2 ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస్ ప్రసాద్, రేవు సువర్ణరాజు, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నరసింహారావు, ఒడుగు దశరథ రామయ్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అరెస్టు

మచిలీపట్నం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలిపై దాడి చేసి కాసులపేరును అపహరించిన ఆటో డ్రైవర్ వీరంకి వెంకటేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఇనకుదురు సీఐ పరమేశ్వర్ గురువారం తెలిపారు. దోపిడీ చేసిన బంగారాన్ని నిందితుడు వెంకటేశ్వరరావు మచిలీపట్నం శ్రీనివాసా జ్యూయలరీలో అమ్మి నగదు తీసుకున్నాడని తెలిపారు. నిందితుడు వెంకటేశ్వరరావును కోర్టుకు పంపామన్నారు.

ఈశ్వర్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు అభినందన



అవనిగడ్డ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో ఈశ్వర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు స్వర్ణ, రజిత పతకాలు సాధించారు. విజేతలను, నిర్వాహకులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు పి.ఈశ్వర్, పి.విశ్వలు పాల్గొన్నారు.

సుబ్బు తైక్వాండో విద్యార్థుల ప్రతిభ



చల్లపల్లి : నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సుబ్బు తైక్వాండో వారియర్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. సై. ప్రెసిడెంట్ మాస్టర్ పి.ఈశ్వర్, కార్యదర్శి మాస్టర్ పి.విశ్వ విద్యార్థులను, కోచ్ మాస్టర్ కె.సుబ్బు, కె.జాహ్నవిలను అభినందించారు.